నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL


# ప్రచార ఆర్భాటం



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సిలిండర్ బెలూన్

**కలెక్టరేట్ ఎదుట**

**రూ.500 సిలిండర్ బెలూన్**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రేషన్‌కార్డు ఉన్న పేదలకు రూ.500లకు సిలిండర్‌ను అందిస్తున్నది. ఇందులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 85,210 మంది దరఖాస్తులు అందజేశారు. వీరిలో చాలామందికి రూ.500 సిలిండర్ అందలేదు. వివరాలు సరిగా నమోదు చేయనుందకు సబ్సిడీ డబ్బులు అందడం లేదంటూ చెప్పిన ప్రభుత్వం సవరణల కోసం అవకాశం కల్పించింది. ప్రజాపాలన కేంద్రాల వద్ద జనం తప్పుల సవరణ కోసం బారులుదీరారు. అయినప్పటికీ చాలా మందికి రూ.500 సిలిండర్ పంపిణీ కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ పథకాన్ని ఆర్భాటంగా ప్రచారం చేస్తుంది. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 సిలిండర్ ఇస్తున్నామంటూ బెలూన్‌తో కూడిన సిలిండర్ బొమ్మను ఏర్పాటు చేశారు.

# ఆరోగ్య మిత్రల ధర్నా

- **సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆరోగ్య మిత్రలు

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదిహేడేండ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఆరోగ్య మిత్రలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. జీవో నంబర్ 60 ప్రకారం రూ.22,750ల వేతనాలు ఇవ్వాలి. టీఏ, డీఏ సౌకర్యం వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్య దర్శి నవీన్ కుమార్, ఆరోగ్య మిత్ర జిల్లా నాయకులు శ్రీనివాస్, విశ్వనాథ్ భీమ్రావు, అనిత, సుజాత, గంగామణి పాల్గొన్నారు.

# జడ్పీ సీఈవో సుడిగాలి పర్యటన



మొక్క నాటి నీరు పోస్తున్న జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ఉట్నూర్/ఉట్నూర్ రూరల్/ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 19 : ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో గురువారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జితేందర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. ఉట్నూర్‌లోని స్థానిక ప్రభుత్వ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మత్తడిగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఇంద్రవెల్లి మండలంలోని ఏమాయికుంట పంచాయతీ పరిధిలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటారు. ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేర్వేరు కార్యక్రమాల్లో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ నివాస ఆవరణలలో మొక్కలు నాటాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనంతోపాటు గుడ్లు, కూరగాయలు వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉట్నూర్ నుంచి గూడిహత్నూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించి, దోమల నివారణకు కృషి చేయాలని సూచించారు.

# ధరల మోత

## భారీగా పెరిగిన కూరగాయల ధరలు

- **వర్షాలతో దెబ్బ తిన్న పంటలు**
- **సలసల కాగుతున్న వంట నూనెలు**



**ధరలు ఇలా..(కిలో)**

| కూరగాయలు | ప్రస్తుతం |
|---|---|
| బీరకాయ | రూ.100 |
| చిక్కుడు | రూ.80 |
| క్యారెట్ | రూ.80 |
| కాకర | రూ.70 |
| గోరు చిక్కుడు | రూ.70 |
| దొండకాయ | రూ.60 |
| బెండకాయ | రూ.60 |
| వంకాయ | రూ.60 |
| టమాట | రూ.40 |

**ధరలు ఇలా..(లీటరు)**

| నూనె | నెల క్రితం | ప్రస్తుతం |
|---|---|---|
| సన్ ఫ్లవర్ | రూ.112 | రూ.130 |
| పల్లి నూనె | రూ.140 | రూ.160 |
| పూజ నూనె | రూ.110 | రూ.125 |

నిర్మల్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ) : భారీ వర్షాలు, వరదల కారణంగా కూరగాయల ధరలపై ప్రభావం పడింది. వర్షాలకు ముందు ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపు పలుకుతున్నాయి. మండు వేసవిలో కూడా ధరలు ఇలా ఉండేవి కావని జనం వాపోతున్నారు. సాధారణంగా వానకాలంలో కూరగాయల ధరలు తక్కువగా ఉంటాయి. కానీ.. ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురవడం, వరదలు రావడంతో స్థానికంగా సాగు చేసే కూరగాయలు, ఆకు కూరల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుని రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. ప్రధాన మార్కెట్లతో పోలిస్తే చిన్న చిన్న కూరగాయల దుకాణాల వద్ద ధరలు అధికంగా పలుకుతుండడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

### అమాంతం పెరిగిన నూనె ధరలు

నిత్యావసర సరుకుల్లో ప్రధానమైన వంట నూనె ధరలు కొన్ని రోజులుగా భారీగా పెరిగాయి. వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచడంతో ధరలు పెరిగాయంటున్నారు. వంట నూనెల ధరలను పెంచి పండుగల వేళ ప్రజలకు భారీ షాక్ ఇచ్చింది. ధరలు అమాంతం పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజు కూలీ చేసుకునే ప్రజలపై ధరల పెరుగుదల తీవ్ర ప్రభావం చూపుతున్నది. కొంతమంది వ్యాపారులు పాత స్టాక్‌ను కొత్త ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రోజు జిల్లావ్యాప్తంగా వేల లీటర్లలో ఆయిల్ ప్యాకెట్లను కొనుగోలు చేస్తారు. ప్రధానంగా గోల్డ్ డ్రాప్, ఫ్రీడమ్, నట్‌గోల్డ్, ప్రియా, విజయ, సఫోల బ్రాండ్లతో నూనె ప్యాకెట్లను మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఐదు లీటర్లు, పది లీటర్లు, 15 లీటర్ల క్యాన్లు అందుబాటులో ఉంటాయి. వాటి ధరలు కూడా 20 శాతం వరకు పెరిగినట్లు చెబుతున్నారు.

### నూనెల ధరలు మండిపోతున్నాయి..



*వంట నూనెల ధరలు మండిపోతున్నాయి. వీటికి తోడు కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరిగి పోయాయి. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ధరలు కొనసాగితే ఇబ్బందులు తప్పవు. ఎన్నికలప్పుడు పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని చెప్పే ప్రభుత్వాలు నిత్యావసర సరకుల ధరలు పెరిగినప్పుడు ఏ మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరం. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.*

**- రుచిత, గృహిణి, నిర్మల్**

### ధరలు రెట్టింపయ్యాయి..



*నెల రోజుల కిందటి వరకు కూరగాయలు కొంచెం తక్కువ ధరలోనే దొరికాయి. ఈ వారం పది రోజుల నుంచి ధరలు రెట్టింపయ్యాయి. గల్లీలు, రోడ్ల పక్కన పెట్టి అమ్మే వారి దగ్గర ఇంకా ఎక్కువకు కొనాల్సి వస్తున్నది. ఏటా ఈ సీజన్‌లో ఇంత ధరలను ఎప్పుడూ చూడలేదు. ఎండాకాలంలో ఉండే ధరలు ఇప్పుడు పలుకుతున్నయ్. ఇలాగే ఉంటే రోజు కూలి చేసుకుని బతికే మాలాంటోళ్లకు కష్టమే. రైతు బజార్లలో తక్కువ ధరలకు కూరగాయలు అమ్మేలా చూడాలి.*

**- సాయిలు, రాంనగర్, నిర్మల్**

# బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



కుంటాల పోలీస్ స్టేషన్‌లో ముందస్తు అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

కుంటాల, సెప్టెంబర్ 19 : కాంగ్రెస్ పార్టీ రుణమాఫీపై మాట తప్పిన క్రమంలో కేటీఆర్ పిలుపు మేరకు ధర్నాలో పాల్గొనేందుకు బయలుదేరిన పార్టీ మండల కన్వీనర్ పడకంటి దత్తు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొంతల పోశెట్టిలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పక్షాన పోరాడతామని అన్నారు.

# ఆరోగ్య శ్రీ ఉద్యోగుల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 19 : ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్‌లకు వినతిపత్రం ఇచ్చామని తెలిపారున. బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఎదుట నిరవదిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రిని కలిస్తే శుక్రవారం చర్చలకు రమ్మన్నారు. పరిష్కారం కాకపోతే కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరవదిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సెక్రటరీ సురేశ్, ఆరోగ్య మిత్రలు స్వప్న, కల్పన, అశ్విని, రజిత, విజయలక్ష్మి, ప్రవీణ్‌రెడ్డి, ముకేశ్ పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయాలి..



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 19 : ఎస్సీ, ఎస్టీ, క్రిమిలేయర్ పైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేఖ పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్, రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 30న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ వద్ద మధ్యాహ్నం 2 గంటలకు సమావేశాన్ని నిర్వహించి అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు రత్నం రావు, రాజలింగం, రమేశ్ ఉన్నారు.

# సిమెంటు పరిశ్రమకు భూములివ్వం..

- **అధికారులు బలవంతం చేయవద్దు**
- **ఎకరానికి రూ.40 లక్షలు చెల్లించాలి**
- **కలెక్టరేట్ ఎదుట నిర్వాసిత రైతుల ఆందోళన**



ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

ఆదిలాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి గ్రామంలో ఏర్పాటు చేయనున్న రేణుక సిమెంటు పరిశ్రమ విషయంలో ఎకరానికి రూ.40 లక్షలు చెల్లించాలని, లేనిపక్షంలో భూములిచ్చే ప్రసక్తే లేదని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాలకు చెందిన రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రేణుక సిమెంటు ఫ్యాక్టరీకి భూములిచ్చే విషయంలో అధికారులు తమను వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసుల ప్రకారం తాము ఆర్డీవో కార్యాలయానికి వచ్చి తమ అభిప్రాయాలు తెలియజేసినా పలుమార్లు భూములు ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములు సిమెంటు పరిశ్రమకు అప్పగిస్తే తాము ఉపాధి కోల్పోతామని, కుటుంబాలు వీధిన పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు సాత్నాల నీటి ప్రవాహం ఉందని, రెండు పంటలు పండిస్తున్న తమ భూములను లాక్కొనే ప్రయత్నాలను అధికారులు మానుకోవాలని కోరారు. 2017-18 సంవత్సరంలో రేణుక సిమెంటు ఫ్యాక్టరీకి 110 ఎకరాల భూములు విక్రయించిన రైతులకు ఎకరాకు రూ.9.25 లక్షలు చెల్లించారని, ఇప్పుడు మరో 600 ఎకరాలు సేకరిస్తున్న ప్రభుత్వం ఎకరాకు రూ.8.50 లక్షలు ఇస్తామని ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు.

### ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలి..

రామాయి పరిసర ప్రాంతాల్లో ఎకరం భూమికి రూ.40 లక్షల వరకు ధర ఉందని, సిమెంటు పరిశ్రమకు భూములు సేకరిస్తున్న ప్రభుత్వం ఈ ధరను తమకు చెల్లించాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని తాము అధికారులకు రెండు నెలల నుంచి తెలియజేస్తున్నా పట్టించుకోకుండా వారు నిర్ణయించిన ధరకు భూములు ఇవ్వాలని నోటీసులు ఇస్తున్నారని రైతులు తెలిపారు. పరిశ్రమ భూ సేకరణ విషయంలో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించకుండా, రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా బలవంతంగా భూములు ఇవ్వాలని అంటున్నారని తెలిపారు.

### నోటీసులు ఇస్తూ వేధిస్తున్నారు..



*నాకు రామాయి శివారులోని సర్వే నంబరు 82/14 లో నాలుగు ఎకరాల భూమి ఉంది. తాతల కాలం నుంచి ఈ భూమిని సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నా. నా భూమి రేణుక సిమెంటు పరిశ్రమకు ఇవ్వాలంటూ ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయం అధికారులు రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. మొదటిసారి ఇచ్చిన నోటీసు ప్రకారం ఆగస్టు 9 తేదీన ఆర్డీవో కార్యాలయానికి వచ్చి నా అభిప్రాయాన్ని తెలియజేశా. ఈ నెల 13న మరో నోటీసు ఇచ్చి గురువారం రావాలని సూచించారు. ప్రైవేటు సిమెంటు పరిశ్రమ కోసం రెవెన్యూ అధికారులు అమాయక రైతులను వేధింపులకు గురి చేయడం మంచిది కాదు. నేను ప్రైవేటు పరిశ్రమకు భూమి ఇవ్వదల్చుకోలేదు. ఇప్పుడు పంటల సీజన్. వ్యవసాయ పనులు ఉంటాయి. భూములు లేకపోతే మా బతుకు రోడ్డున పడతాయి.*

**- బేత గంగన్న, .రైతు, రామాయి, ఆదిలాబాద్ రూరల్**

### భూములు పోతే ఎట్ల బతుకుతాం..



*వ్యవసాయమే మా జీవనాధారం. భూములు లేకపోతే ఉపాధి ఉండదు. వేరే పనులు చేయలేం. గతంలో భూములు అమ్ముకున్న రైతుల పూట గడవడం కష్టంగా ఉంది. అలాంటప్పుడు మెమూ ఇచ్చి ఏం చేయాలి. నాకు రామాయిలో రెండెకరాల భూమి ఉంది. భూమి ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. ఎకరాకు రూ.40 లక్షలు ఇస్తే ఇస్తామని గతంలో మా అభిప్రాయాన్ని చెప్పినా పదే, పదే పిలుస్తున్నారు. ఆరేండ్ల కిందట ఇచ్చిన ధర కంటే తక్కువగా ఇస్తామంటున్నారు. ఇదెక్కడి న్యాయం.*

**- బుర్రి రాజేశ్వర్, రైతు, రామాయి**

### భూములు కోల్పోతే కూలీలుగా మారుతారు..



రెవెన్యూ అధికారులు రేణుక సిమెంటు ఫ్యాక్టరీకి అనుకూలంగా వ్యవహరిస్తూ రైతులను బెదిరింపులకు గురి చేస్తున్నారు. గతంలో పరిశ్రమకు భూములు ఇచ్చిన రామాయి, యాపల్‌గూడ, రాంపూర్ రైతులు భూములు ఇచ్చి ఉపాధి లేక కూలీలుగా మారారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్యాయంగా అధికారులు భూములు చూపించాలి. లేని పక్షంలో ఎకరాకి రూ.40 లక్షలు చెల్లించాలి. అధికారుల బెదిరింపులకు రైతులు భయపడరు.

**- లంకా రాఘవులు, రైతు సంఘం నేత**

# తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు



అప్రోచ్ రోడ్డుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

నమస్తే ఎఫెక్ట్

ఖానాపూర్, సెప్టెంబర్ 19 : ఖానాపూర్ పట్టణ శివారులోని రెంకొనివాగు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు రెండు నెలల క్రితం వర్షాలకు కోతకు గురైంది. నిర్మల్, మంచిర్యాల జిల్లాల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెప్టెంబర్ 14వ తేదీన నమస్తే తెలంగాణలో 'రోడ్డు కోతతో అవస్థలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో గురువారం అధికారులు, కంట్రాక్టర్ స్పందించారు. ఖానాపూర్-తర్లపాడు రెంకొనివాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు నిర్మాణానికి మరమ్మతులు చేపట్టారు.

# ఇంట్లో వాడే సిలిండర్లను హోటల్స్‌లో వాడొద్దు..

- **జిల్లా పౌర సరఫరాల అధికారి వజీద్ అలీ**
- **50 షాపుల తనిఖీ.. 12 మందికి నోటీసులు జారీ..**



సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లతో అధికారులు

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : గృహావసరాలకు వినియోగించాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను హోటల్స్‌లో వాడొద్దని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వజీద్ అలీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు హోటల్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గృహావసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను హోటల్స్‌లో వాడుతుండగా అధికారుల చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సిలిండర్స్‌ను సీజ్ చేసిన అధికారులు గోదాములకు తరలించారు. కమర్షియల్ సిలిండర్లను వాడకుండా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న హోటళ్లకు నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. డోమోస్టిక్ గ్యాస్ సిలిండర్లను కామర్షియల్‌గా వినియోగిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు దాడులు చేపట్టారు. 50కి పైగా హోటల్స్‌ను తనిఖీ చేయగా.. 12 హోటల్స్ యాజమాన్యాలకు నోటీసు ఇచ్చామని తెలిపారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు నారాయణ, ప్రేంనివాస్, మధుసుదన్, రామారావు, విశ్వనాథ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- **ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**
- **చించోలిలో చిన్నారికి అన్నప్రాసన**



చిన్నారికి అన్న ప్రాసన చేయిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నేరడిగొండ, సెప్టెంబర్ 19 : పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండలంలోని చించోలి గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ పోషకాహారం తీసుకునే విధానంపై వివరించారు. గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి, చిన్నారికి అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మిల్కా, సీడీపీవో సౌందర్య, మండల ప్రత్యేకాధికారి రవీందర్, తహసీల్దార్ ఎంఏ కలీం, ఎంపీడీవో రజ్వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఐకేపీ ఏపీఎం ఉత్తం, ఎస్‌బీఎం చంపత్, మాజీ సర్పంచ్ జంగు, గ్రామ పటేల్ లాల్‌రాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పాల్గొన్నారు.

### పీహెచ్‌సీ తనిఖీ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానకు వచ్చే రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి, రికార్డులను చూశారు. ఆస్పత్రి ఆవరణలోని పాత బావిని పూడ్చాలని ఎంపీడీవో, పంచాయతీ పాలకవర్గాన్ని ఆదేశించారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యం

- **కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 19 : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో గురువారం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ పోషణ, పోషకాహారం, శుద్ధ జలం, పరిశుభ్రతపై ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. 926 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. జాతీయ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, వైద్యులు నయనారెడ్డి, సౌమ్య పాల్గొన్నారు.



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అభినవ్